

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

పర్బత్‌కే ఉస్ పార్
పర్బత్‌కే ఇస్ పార్
గూంజ్ ఉఠీ ఛమ్ ఛమ్ ఛమ్
మెరీ పాయల్ కీ ఝున్‌కార్.

హిందీ సినీ ప్రపంచంలో సంగీతం ప్రాధాన్యం కోల్పోయి డిష్యుం డిష్యుంల నడుమ రిలీఫ్ కోసం వినిపించే 'శబ్దం'లా మారుతున్న తరుణంలో ఎడారిలో ఒయాసిస్సులా మండుటెండల్లో చల్లని వర్షంలా, ఎండి మోడయిన చెట్టు శాఖల అంచున పచ్చగా కనిపించే లేత చివురింపులా 'మ్యూజికల్ హిట్'గా నిలచిన సినిమా 'సరగమ్'. 'సరగమ్' 'సిరిసిరిమువ్వ'గా సూపర్ హిట్ అయిన తెలుగు సినిమా. దర్శకుడు విశ్వనాథ్ కెరీర్‌కు ఊపునిచ్చిన సినిమా. అంతవరకూ చక్కని దర్శకుడిగా మాత్రమే పేరున్న విశ్వనాథ్ అత్యుత్తమ సినిమా దర్శకుడిగా పేరు సంపాదించిపెట్టిన సినిమా 'సిరిసిరిమువ్వ'.

సినీ సంగీతాన్ని గమనిస్తే ప్రతి అయిదేళ్లకూ సినీ సంగీతం ట్రెండ్ మారటం కనిపిస్తుంది. ఒక ప్రతిభావంతుడయిన సంగీత దర్శకుడి అత్యుత్తమ సృజనాత్మక ప్రదర్శన కాలం కూడా దాదాపుగా అయిదు సంవత్సరాలే. ఆ అయిదు సంవత్సరాల కాలం తరువాత ఎంత లేదన్నా అతని సృజనలో పదును తగ్గుతుంది. ఈలోగా మరో కొత్త సంగీత దర్శకుడు రంగప్రవేశం చేస్తాడు. సంగీతం ట్రెండ్ మారుతుంది. అందుకే సాధారణంగా ఒక సంగీత దర్శకుడి ఉచ్చదశ అయిదు, పదేళ్ళ నడుమ ఉంటుంది. అయితే కొందరు సంగీత దర్శకులు ఈ ట్రెండ్‌లతో సంబంధం లేకుండా 'హిట్' సంగీతాన్ని చిరకాలం అందిస్తారు. వారికి అయిదు, పదేళ్ల పరిమితి వర్తించదు. వీరు ట్రెండ్ సెట్టర్లు కారు. ట్రెండ్ సెట్టర్లను అధిగమించిపోయేవారు వీరు. అంతేకాదు, ఇతరుల ట్రెండ్‌ను అనుసరిస్తూ కూడా తమ మూలాలను మరచిపోకుండా, తమ ప్రత్యేకతను నిలుపుకుంటారు. తెలుగులో మహదేవన్, హిందీలో లక్ష్మీకాంత్ ప్యారేలాల్‌లు ఇలాంటి సంగీత దర్శకులు.

కె.వి. మహదేవన్ 1942లో సినీ రంగంలోకి ప్రవేశించాడు. అప్పటినుంచి 1993వరకూ అంటే అయిదు దశాబ్దాలుగా, దాదాపుగా ఆరువందల సినిమాలకు సంగీత దర్శకత్వం వహించాడు. పలు సూపర్ హిట్ గీతాలను సృజించాడు. కానీ ఆయన ఎన్నడూ ట్రెండ్ సెటర్ కాదు. ఇతరులు సృజించిన ట్రెండ్‌లో వారిని మించి సంగీతాన్ని సృజిస్తూ కూడా తన ప్రత్యేకతను కోల్పోకుండా సినీగీతాలను సృజిస్తూ వచ్చాడు. ఓవైపు సామాన్యులను ఉత్తేజపరిచే గీతాలను సృజిస్తూ కూడా పండితులను, పామరులను ఉర్రూతలూగించే సంగీతాన్ని సృజించాడు మహదేవన్.

లక్ష్మీకాంత్ ప్యారేలాల్‌లు 1963లో సినీరంగ ప్రవేశం చేశారు. అప్పటినుంచి 1998లో లక్ష్మీకాంత్ మరణించేవరకూ అంటే 45 ఏళ్లు, 750 సినిమాలకు సంగీత దర్శకత్వం వహించారు. వారు కెరీరు ఆరంభించినప్పుడు హిందీ సినీ ప్రపంచంలో శంకర్ జై కిషన్ శకం నడుస్తోంది. లక్ష్మీ ప్యారేలు శంకర్ జై కిషన్ అనుకరణకారులుగా తెరపైకి వచ్చారు. శంకర్ జై కిషన్ లాంటి సంగీతానికి తమదైన ప్రత్యేకతను జోడించి మెప్పించారు. శంకర్ జైకిషన్‌ను దాటిపోయారు. ఒక దశలో శంకర్ జైకిషన్ బాణీలు లక్ష్మీ ప్యారేల బాణీలుగా అనిపించేంతగా

ఎదిగారు లక్ష్మీప్యారే. ఈలోగా ఆర్డీ బర్మన్ ట్రెండ్ వచ్చింది. తరువాత అమితాబ్ ఎదుగుదల సినీసంగీతాన్ని పక్కకి నెట్టేసింది. అటుతరువాత బప్పీలహరి 'డిస్కో ట్రెండ్' వచ్చింది. తరువాత 'నదీం – శ్రవణ్', 'ఏ.ఆర్. రహమాన్' ఇలా కొత్త కొత్త సంగీత దర్శకులు తెరపైకి వస్తూ నిప్పులు చిమ్ముకుంటూ నింగికి ఎగసారు. తరువాత నెత్తురు కక్కుకుంటూ నేలకు రాలారు. కానీ లక్ష్మీప్యారే తమ ధోరణిలో ట్రెండ్‌ను అనుకరిస్తూ, అవకాశం దొరికినపుడు తమ ప్రత్యేకతను ప్రదర్శిస్తూ ముందుకు సాగిపోయారు తప్ప ఆగలేదు. అలవలేదు. తమదంటూ ఓ ప్రత్యేక ట్రెండ్ సెట్ చేయలేదు. అందుకే తెలుగులో సాలూరి రాజేశ్వరరావు, చక్రవర్తిల్లా మహదేవన్ పేరు ప్రత్యేకంగా చెప్పరు. అలాగే హిందీలో నౌషాద్, ఆర్డీబర్మన్‌లలా లక్ష్మీప్యారేను ప్రత్యేకంగా ప్రస్తావించరు. 'సిరిసిరిమువ్వ' సినిమాకు తెలుగులో మహదేవన్, హిందీలో 'సర్‌గమ్'కు లక్ష్మీప్యారే సంగీత దర్శకులు.

నిజానికి ఆ కాలంలో విశ్వనాథ్‌కు నచ్చేరీతిలో శాస్త్రీయ సంగీతాన్ని, పాపులర్ గీతంగా మలచగల ఏకైక సంగీత దర్శకులు 'లక్ష్మీప్యారే' కాబట్టి విశ్వనాథ్ 'సిరిసిరిమువ్వ'ను హిందీలో రీమేక్ చేస్తున్నప్పుడు 'లక్ష్మీప్యారే'ను సంగీత దర్శకులుగా ఎన్నుకోవటం తప్పనిసరి. ఆ కాలంలో ఆర్డీబర్మన్ విచిత్ర శబ్ద సృష్టిపై పెట్టిన ధ్యాస మెలోడీపై పెట్టటంలేదు. కళ్యాణ్‌జీ ఆనంద్‌జీల సృజనాత్మక స్రవంతి ఇంకిపోతోంది. బప్పీలహరి అప్పుడప్పుడే తెరపైకి వస్తున్నాడు. తనదైన ముద్ర సినీ సంగీతంపై వేసేందుకు ఇంకా సమయం ఉంది. దాంతో శాస్త్రీయ సంగీతంపై పట్టువున్న లక్ష్మీప్యారేను 'సర్‌గమ్' సంగీత దర్శకులుగా ఎన్నుకున్నాడు విశ్వనాథ్.

'పర్బత్ కే ఉస్ పార్ ' పాటకు సమానమైన పాట తెలుగులో అత్యద్భుతమైన పాట

**ఝుమ్మంది నాదం, సై అంది పాదం**

**తనువూగింది ఈ వేళ, చెలరేగింది ఒక రాసలీల.**

ఒక్కసారి సినీపాటల రచయితల ప్రపంచాన్ని పరికించి చూస్తే వేటూరిలాంటి గేయరచయిత మరొకరు లేరన్న విషయం స్పష్టం అవుతుంది. వేటూరికి మజ్రూహ్ సుల్తాన్‌పురి దగ్గరగా వస్తాడు. కానీ, మజ్రూహ్ తన అరవైఏళ్ల పైన గేయ రచనా జీవితంలో ఒక్క అశ్లీలమైన పాటకూడా రాయలేదు. Non Sensical పాటలను కూడా Most sensibleగా సృజించే గేయరచయత మజ్రూహ్. ఇందుకు భిన్నంగా వేటూరి అన్నిరకాలు అంటే ఎన్ని రకాలున్నాయో అన్ని రకాల పాటలనూ అంతే నిజాయితీగా గొప్పగా రాశాడు.

సిరిసిరిమువ్వలో నాయిక మూగ అమ్మాయి. దాంతో 'నృత్యం' ఆమె భాష అవుతుంది. ఇంట్లో వారికి ఆమె నృత్యం ఇష్టం ఉండదు. మనసులో మాట చెప్పుకునేందుకు ఆమెకు డప్పు వాయించే నాయకుడు తప్ప మరెవరు ఉండరు. దాంతో ఆమె 'కల'లో ఆమె నృత్యానికి నాయకుడు డప్పు వాయించటం స్వాభావికం. గేయ రచయిత ప్రతిభ ఎక్కడ తెలుస్తుందంటే ఒక మామూలు సన్నివేశాన్ని తన గేయరచన ప్రతిభతో ఒక అలౌకికమైన ఆనందానుభూతిని కలిగించే రీతిలో మలచటం.

నాయిక మూగది. మాట్లాడలేదు. కాబట్టి నాయకుడిని పిలవలేదు. ఆమె భాష గజ్జెల శబ్దం. అందుకే ఝుమ్మది నాదం. సై అంది పాదం అని సూచిస్తోంది.

పాట బాణీని మోహనం, రేవతి రాగాల రాగమాలికగా సృజించాడు మహదేవన్. అంటే రాగాన్ని ఎంచుకోవటంలోనే శ్రోతలను మోహింపచేశాడన్నమాట. అందుకే పాట ఒక రకమైన తన్మయత్వాన్ని కలిగిస్తుంది. సుశీల పాట ఆరంభించటంతోటే ఝుమ్మన్న నాదంతోటే ఝల్లుమంటుంది గుండె. దాంతో నాయిక పాదం 'సై' అంటుంది. శ్రోత గుండె 'ఆహా' అంటుంది. ఇక తనువు ఊగటం స్వాభావికం. ఆధునిక సంగీతం తనువును ఊపుతుంది. మనస్సును స్పృశించలేదు. కానీ మధురమైన సంగీతం మనస్సును ఊపుతుంది. దాంతో తనువూ ఊగక తప్పదు.

**మన్ డోలే మెర తన్ డోలే**

**మెర దిల్‌కా గయా కరారే రే**

**కౌన్ బజాయే బాసురియా**

నాగిన్ సినిమాలో దేశాన్ని సమ్మోహితం చేసిన మధురమైన పాట ఇది. నాయకుడు 'బాసురి' అంటే వేణువు. కానీ సినిమాలో నాయకుడు వేణువులాంటి వాయిద్యాన్ని ఊదటం ద్వారా పాములను వశీకృతం చేసుకుంటాడు. అతని వేణునాదం విని నాయిక మనసూగింది. తనువూగింది. ఆమె హృదయంపై ఆమె పట్టుకోల్పోయి వివశ అయింది. పరవశమయింది. కాబట్టి మనస్సు ఊగితే తనువు ఊగటం తప్పదు. తనువు, మనసు ఊగితే మైకంలాంటి పరవశం క్రమ్మటం తప్పదు. కాబట్టి ఝుమ్మన్ననాదంతో సై అన్న పాదం జతగూడితే తనువూగటం స్వాభావికం. అయితే, ఇక్కడ నాయిక నాయకుడితో కలసి నృత్యం చేస్తోంది. 'రాసలీల ' మాధుర్యాన్ని సూచిస్తుంది. అలౌకికమైన ఆనందాన్ని సూచిస్తుంది. శృంగారాన్ని సూచిస్తుంది. నాయిక మనస్సులో తన ప్రమేయం లేకుండా, అలాంటి భావన నిద్రాణ స్థితిలో ఉందన్న గ్రహింపు లేకుండా నాయకుడి పట్ల నిగూఢంగా ఉన్న శృంగార భావనను అత్యంత సున్నితంగా సూచిస్తుంది 'రాసలీల' అన్న పదం. ఇదీ వేటూరి సృజించిన పల్లవి. అత్యద్భుతం. ఎంతో మార్మికంగా, ఔచితీవంతంగా నాయిక మనసులో నిగుఢంగా ఉన్న భానవను, అత్యంత సంస్కారవంతంగా ప్రకటించాడు గేయరచయిత.

నిజానికి ఈ పల్లవి మీదనే ఒక వ్యాసం రాయవచ్చు. ఒక సన్నివేశాన్ని గేయరచయిత, ఏ రకంగా శ్రోత కానీ, ప్రేక్షకుడు కానీ గమనించకుండానే వారిని సన్నివేశంలో తన్మయం చేయగలడో అత్యద్భుతంగా ప్రదర్శిస్తుందీ పల్లవి. నాయికకు మాట రాదు. కాబట్టి ఆమె సౌంజ్ఞలద్వారానే తన భావాలను తెలపగలదు. ఆమె పాదం కదలిక ఆమె సౌంజ్ఞ. 'ఝుమ్మంది నాదం, సై అంది పాదం ' అనటం వెనుక ఇంత ఆలోచన ఉంది. నృత్యం ఒక భాష. నర్తించే సమయంలో నర్తకి కదలికలు, ముద్రలు, హావభావాలు మౌనంగా నర్తకి మనస్సులోని భావాలను ప్రతిబింబిస్తాయి. ఎదుటి మనిషితో కమ్యునికేట్ చేస్తాయి. నాదం, పాదం నడుమ ఉన్న సంబంధం ఇది. ఈ నృత్య భాషను అర్థం చేసుకోలేని వారికోసం సాహిత్యం అవసరం తప్ప, నృత్యానికి సాహిత్యం అవసరంలేదు. అందుకే నాయిక నాదం, పాదంతో తన మనస్సులోని మాటను చెప్పటం ప్రారంభించింది.

ఇదే హిందీలోకి మారేటప్పటికి ఔచిత్యాన్ని, సున్నితత్వాన్నీ కోల్పోయింది.

**పర్బత్ కే ఉస్ పార్, పర్బత్ కే ఇస్ పార్**

**గూంజ్ ఉఠీ చమ్ చమ్ చమ్**

**మెరీ పాయల్ కీ ఝున్‌కార్**

మాటలు రాని తెలుగు నాయిక తన నృత్యం ద్వారా భావాన్ని వ్యక్త పరుస్తానంటూంటే, మాటలురాని హిందీ నాయిక, పర్వతానికి ఆ వైపున, ఈ వైపున తన గజ్జెల గలగల వినిపిస్తోందంటోంది. తెలుగు పాటలోని సున్నితత్వం, మాధుర్యం, ఔచిత్యం లాలిత్యం హిందీ పాటలో అదృశ్యమైపోయాయి. ఆనంద్ బక్షీ రచించిన హిందీపాటలో 'భావం' మారిపోయింది.

తెలుగులో నాయిక తన మనసులో సుళ్లు తిరుగుతూన్నా పైకి వ్యక్తపరచలేని సున్నితమైన భానలను తన కలలోని గానంద్వారా అతి సుందరంగా అతి మృదువైన పదాలతో వ్యక్తపరుస్తూంటే, హిందీలో నాయిక పర్వతానికి రెండువైపుల చమ్ చమ్ అంటూ తన మువ్వలు మ్రోగుతున్నాయని ఢంకా బజాయించి చెప్తోంది. సున్నితత్వం దరిదాపులకు రాదు. లతా మగేష్కర్ తేనెలూరే స్వరం పాట మాధుర్యాన్ని పెంచి

తీపిగా చేస్తుంది. కానీ లత, రఫీల స్వరాలు, లక్ష్మీ ప్యారే బాణీల మాయాజాలాన్ని తొలగించి చూస్తే తెలుగు పాటముందు, ముఖ్యంగా పాటలో పదాల లాలిత్యం, భావం, ఔచిత్యం వంటి విషయాల్లో హిందీ పాట తేలిపోతుంది.

**ఎదలోని సొదలా, ఎలదేటి రొదలా**

**కదిలేటి నదిలా, కలల వరదలా**

**చలిత లలిత పద కలిత కవిత లత, సరిగమ పలికించగా**

**స్వర మధురిమ లొలికించగా**

**సిరిసిరి మువ్వలు పులకించగా...**

తెలుగులో వేటూరి పాట రాశాడు అనటం కన్నా మృదుమధురమైన, అత్యంత సున్నితమైన లలితమైన కవితను సృజించాడనవచ్చు. ఏమి పదాలు! ఏమి భావం. గమనిస్తే, పల్లవినీ, చరణాన్నీ ద్విత్వాక్షరాలు లేని పదాలతో నింపేశాడు. ఒక్క ఝుమ్మందిలో 'మ్మ', సిరిసిరిమువ్వలులో 'వ్వ' తప్ప. అవికూడా ఆయాస్థానాల్లో గేయాన్ని మధురమయం చేస్తాయి కాబట్టి వాడాడు తప్ప ద్వితాక్షరాలు లేక లాలిత్యాన్ని తేనెలాగా నింపుకున్న తీయనైన కవిత ఇది. మంచినీటి ప్రవాహంలాంటి స్వచ్ఛమైన కవిత ఇది. అంత మృదుమధురం ఆమె మనసులోని భావం. ఈ పాటలోని పదాల ప్రవాహ వేగంలో పరవశించి, మైమరచిపోయి, ఆనంద ప్రవాహంలో కొట్టుకుని పోతాం. మామూలు ఆనందం కాదిది. బ్రహ్మానందం. అలౌకికానందం. అత్యుత్తమ సాహిత్యం. సరస్వతీదేవికి అంజలి ఘటించటం అన్నది అనుభవానికి వస్తుంది. సినీ సందర్భంలోని ఔచిత్యం పాటిస్తూ నాయిక ఉత్తమ వ్యక్తిత్వానికి భంగం కలగకుండా, అతి సున్నితమైన భావాన్ని ప్రదర్శిస్తూ, నాయికలో అస్పష్టంగా, ఉన్న శృంగార భావనల స్వరూపాన్ని అంతే నిగూఢంగా ప్రదర్శిస్తూ, దాని ప్రసక్తే లేకుండా, ఆనందపు స్వర్గపుటంచుల వరకూ అత్యంత సులభంగా తన పదాల మాయాజాలంలో పట్టుకుని లాక్కుపోతాడు వేటూరి.

ఆమె ముగ్ధ. ఆమెలోని శృంగార భావనలకు నిర్దిష్టమైన స్వరూపంలేదు. స్పష్టమైన లక్ష్యం లేదు. నాయకుడి పట్ల ఎలాంటి భావనలు ఆమెలో జాగృతం కాలేదు. ఒక యువతి హృదయంలో చెలరేగే అస్పష్టమైన అలజడి స్వరూపం ప్రదర్శిస్తోంది చరణం. ఆమె హృదయంలో చెలరేగుతున్న ఒక భావం. అది ఎలాంటిదంటే తేనెటీగ గానం లాంటిది. కదిలేటి నది వేగం కల భావన. అదొక కలల వరద. చలిత లలిత పద..లలితమైన ఆమెపాదాలు చలనం వల్ల సృజించిన కవిత లత ఇది. మామూలు కవిత కాదది. ఆమె నృత్యంవల్ల కలిగిన భావాలను పొదుగుకున్న కవితలత అది. మృదువైన పదాల కదలికను ప్రతిఫలించే కవిత వల్ల ఎగసిన హృదయ రొద వరద వేగం అది. ఎగసిన హృదయం పలికే సరిగమల నాదం అది. స్వరమధురిమలు ఒలికిస్తుంది. అబ్బబ్బ.. ఇది సినిమా పాటనా? మహాద్భుతమైన భావ కవిత్వమా? లలితమైన ఒక్కొక్క పదం పలుకుతుంటేనే హృదయం ఆనంద మందిరపు ఒక్కో మెట్టు ఎక్కుతూ సిరిసిరిమువ్వలు పులకరించినట్టు ఉత్కృష్టమైన ఆనందానుభూతితో ఆత్మ పులకరిస్తుంది. ఇక్కడ నాయిక 'ఎదలోని రొద' కవి స్పష్టంగా చెప్పటంలేదు. ఒక మాట్లాడలేని మూగయువతి హృదయం, పురివిప్పి స్వేచ్ఛగా నర్తిస్తున్న అత్యంత మధురమైన సందర్భం ఇది. తనలో చెలరేగే సంచలన స్వరూపం అర్థం కాకున్నా దాని తాలూకు మాధుర్యాన్ని తన నృత్యంద్వారా వ్యక్తపరుస్తున్న హృదయనాదానికి పదాల రూపం ఇది. ఒక వ్యక్తి అంతరంగ భావతరంగ సంచలన ధ్వని ఇది.

**ముఝ్ పె పడీ హై కబ్ సే చుప్‌కీ ఇక్ జంజీర్**

**మందిర్ మే చుప్ చాప్ ఖడీ థీ మై బన్‌కే తస్వీర్**

తెలుగులో వేటూరి నిగూఢంగా, మార్మికంగా, సూచ్యప్రాయంగా ప్రదర్శించిన భావాన్ని హిందీలో ఆనంద్ బక్షీ స్పష్టంగా ప్రదర్శించాడు. ఎప్పటినుంచో ఆమె మాటను నిశ్శబ్దపు సంకెళ్లు కట్టి బంధించి ఉంచాయి. ఆమె మందిరంలో నిశ్శబ్దంగా నిలచిన ఒక విగ్రహంలా నిలచి ఉంది. తెలుగులోని ఎలదేటి రొదలు, కదిలేటి నదులు అదృశ్యం అయిపోయాయి. ఆమె ఇన్నాళ్లూ తన భావాన్ని వ్యక్తపరచలేక మౌనంగా ఉంది. సందర్భోచితంగా ఉంది. 'చుప్ కే జంజీర్' అన్నది చక్కని ప్రయోగం. అయితే ఇక్కడే నాయకుడు రంగప్రవేశం చేస్తాడు.

**ఆ చల్‌గా, మై సాథ్ తేరే**

**ఛేడ్ దియే హై సరస్వతీ దేవినే తార్ సితార్**

'నేను నీ వెంట ఉన్నాను. గొంతు విప్పి స్వేచ్ఛగా గానం చెయ్యి. సరస్వతీదేవి సితార్‌ను శృతి చూసుకుంది. ఇక గానం చెయ్యి' అంటున్నాడు నాయకుడు. రఫీ అత్యంత ఆవేశంతో, ఆనందంతో ఉచ్చ స్వరంతో పాడటం పాట విలువను పెంచుతుంది. కానీ ఇది అనౌచిత్యం. అంతవరకు నాయకుడు నాయిక వెంట ఉండి సానుభూతి చూపిస్తాడు తప్ప 'నేనున్నాను నీకు' అనడు. అలా అంటాడన్న భావన కానీ విశ్వాసం కానీ నాయికలో కలగలేదు. ఇక్కడ నాయకుడు ఆమెని 'పాడ'మంటున్నాడు. కానీ ఆమె 'ఆడతా'నంటోంది. ఆమె మువ్వల సవ్వడి అన్ని దిశలలో ప్రతిధ్వనిస్తోంది అన్నది. పైగా ఆమె మాటలు రానిది. నృత్యం ద్వారానే తన భావాన్ని ప్రదర్శించగలదు. 'సరస్వతి వీణ శృతి చూసుకుంది ఇక పాడు' అనటం కవిత్వంగా బాగున్నా, సందర్భం ప్రకారం అనౌచిత్యం. ఎందుకంటే నాయకుడు ఇలా అని 'పర్వత్ నే ఇస్ పార్' అని పల్లవిని అందుకుంటాడు. పల్లవి నృత్యానికి సంబంధించినది. చరణం గానానికి సంబంధించినది. అయితే పాట మాధుర్యం, రఫీ లతాల గానం అన్నిటినీ విస్మరించేట్టు చేస్తుంది. సాహిత్య పరంగా, తెలుగు భాషలో లలితమైన పదాలను సక్రమంగా వాడితే పదాల కలయిక మెట్లుగా బ్రహ్మానందానుభూతిని అనుబవించేట్టు చేయగలిగే గొప్పతనాన్ని చూపిస్తుంది తెలుగు పాట.

**నటరాజ ప్రేయసి, నటనాల ఊర్వశీ**

**నటియించు నీవని తెలిసీ**

**ఆకాశమై పొంగె ఆవేశం, కైలాసమే వంగె నీకోసం.**

అద్భుతం. తెలుగుపాట 'నటనం' నుంచి వైదొలగటంలేదు. నటరాజ ప్రేయసి, నటనాల ఊర్వశీ, ప్రాణాన్ని లాగేసే అద్భుతమైన పదప్రయోగాలు, 'ఆకాశమై పొంగె ఆవేశం' దగ్గర ఊపిరి బిగబడితే 'కైలాసమే వొంగె నీకోసం' అనగానే ఒక దీర్ఘమైన నిట్టూర్పు వెలువడుతుంది. శివుడు నటరాజు. ఆమె నటరాజ ప్రేయసి. ఆమె నటనం కోసం కైలాసం భువిపైకి వంగటం అద్భుతమైన ఊహ. ఔచితీమంతమైన ఊహ. అంతేకాదు కళద్వారా మనిషి దైవం స్థాయికి ఎదుగుతాడు (ఆకాశం పొంగె ఆవేశం), కళ భగవంతుని భూమిపై ప్రతిష్టిస్తుంది. (కైలాసమే వంగె నీకోసం) అన్న భారతీయ కళాతత్త్వాన్ని అతి మార్మికంగా, ప్రదర్శిస్తుంది ఈ చరణం. పల్లవిలోని 'రాసలీల'లోని శృంగార భావాన్ని ఇక్కడి ఆధ్యాత్మిక భావనతో కలిపి చూస్తే రాసలీలలోని ఆధ్యాత్మకత స్పష్టమౌతుంది. నృత్యం భగవంతుడి అర్చన అన్న భావన బోధపడుతుంది.

**నర్తనమే శివకవచం చం**

**నటరాజ పాద సుమరజం జం**

అంటాడు వేటూరి 'నాదవినోదం, నాట్యవిలాసం, పరమ సుఖము, పరము' అన్న సాగరసంగమం పాటలో. ఆ పాటకు ప్రతిపాదనలాంటిది ఈ పాట. సినీమా పాటలకు సాహిత్య గంధం పూయటమే కాదు ఆధ్యాత్మిక శిఖరారోహణకు సోపానాలుగా నిర్మించటం వేటూరి పాటలలో కనిపిస్తుంది. ద్విత్వాక్షరాల ప్రాధాన్యం కల తెలుగు భాషలో ద్విత్వాక్షరాలను అతి తక్కువగా వాడుతూ లలిత పదాలతో అలవోకగా ఆకాశపుటంచులకు ఎగరేసుకుపోవటం వేటూరి పాటలలో కనిపిస్తుంది.

**గం ఎక్ చిట్టీ జిస్‌మే ఖుషియోంకా సందేశ్**

**గీత్ తభీ మన్‌సే ఉర్ తాహై జబ్ లగ్తీ హై ఠేస్**

బాధ అనేది సుఖసందేశాన్ని మోసుకు వచ్చే చీటీలాంటిది. మనస్సుకు గాయం కలిగినప్పుడే హృదయంలోంచి గీతం వెలువడుతుంది .దుఃఖంలోంచే సృజన వెలువడుతుందన్న సత్యాన్ని చెప్తుంది. కానీ ఇక్కడ కూడా నాయకుడు పాట గురించే ప్రస్తావిస్తున్నాడు. నృత్యం ప్రసక్తి పల్లవికే వదిలేసింది పాట.

**ఆ చల్ గా మై సాథ్ తేరే**

**లయే న టూటే, తాల్ న ఛూటే ఛూటే యే సంసార్.**

నీ వెంట నేనున్నాను. నువ్వు పాడు. లయ చెదరద్దు, తాళం తప్పవద్దు, ఈ ప్రపంచం దూరమైనా ఫరవాలేదు అంటున్నాడు నాయకుడు. సందర్భం ఒకటే అయినా 'కవి' హృదయం రెండు పాటల్లోనూ భిన్నం. సంస్కృతి భాష, వ్యక్తిత్వం వంటి విషయాలు ఒకే సందర్భంలో వ్యక్తులు వేర్వేరుగా ప్రతిస్పందిస్తారన్న సత్యానికి ఈ రెండు పాటలు చక్కటి నిదర్శనం. హిందీ గేయరచన ప్రపంచం ఎంతగా భరత్ వ్యాస్ లాంటి కవిలేని లోటును అనుభవిస్తోందో ప్రదర్శిస్తుందీ పాట. అలాగని ఆనంద్‌బక్షీ రచన తక్కువది కాదు. ఆ కాలంలో వస్తున్న హిందీ పాటల సాహిత్యంతో పోలిస్తే 'సర్‌గమ్'లో పాటలు సాహిత్యపరంగా ఉన్నత స్థాయిలో ఉన్నాయి. కానీ తెలుగు పాటతో పోలిస్తే, తెలుగు భాష తెలియని భారతీయ ప్రజలు ఎంతగా కోల్పోతున్నారో అన్న జాలి కలుగుతుంది. 'వృక్షాలు లేని చోట ఆముదం వృక్షమే ' అన్నట్టు 'పర్బత్ కే ఉస్ పార్'నే వారు అద్భుతమైన పాటగా భావించి 'హిట్' చేశారు. వారికి 'ఝుమ్మంది నాదం' తెలియదు.

**మెరుపుంది నాలో... అది నీ మేని విరుపు**

**ఉరుముంది నాలో.. అది నీ మువ్వ పిలుపు**

**చినుకు చినుకులో చిందులయలతో**

**కురిసింది తొలకరి జల్లు**

**విరిసింది అందాల హరివిల్లు**

**ఈ పొంగులే ఏడురంగులుగా..**

కవులని చెప్పుకుని, సన్మానాలు చేసుకుంటూ, వేదికలెక్కి సాహిత్యం గురించి ఉపన్యాసాలిస్తూ సినిమా పాటలను తక్కువ చేసి మాట్లాడే వారంతా వేటూరి పాదధూళిని శిరస్సున ధరించి ఆయన పాదసేవ చేయాలి. చివరి చరణం చాలు వేటూరిలోని కవిత్వం విశ్వరూపం దర్శించటానికి. సినీ సందర్భ పరిధి దాటలేదు. ఔచిత్యం వదలలేదు. నేలవిడిచి సాము చేయలేదు. ప్రబంధ పదబంధాల ఆర్భాటాలు లేవు. అతి లలితమైన పదాలతో కళ్లముందు సప్తవర్ణాల సుందరమైన దృశ్యాన్ని పదాలతో చిత్రీకరించాడు వేటూరి.మొదటి పాదం ఆమెలో నిబిడీకృతమై ఉన్న శక్తిని తెలుపుతుంది. రెండవ పాదం నృత్యం ఆమెలో జాగృతం చేయగల శక్తి స్వరూపాన్ని వివరిస్తుంది. 'తొలకరి జల్లు ' అత్యద్భుతమైన ప్రతీక

**కొత్తగా రెక్కలొచ్చెనా గూటిలోని గువ్వపిల్లకీ**

**మెత్తగా రేకు విప్పెనా కొమ్మ చాటూవున్న కన్నె మల్లికీ**

అని స్వర్ణ కమలంలో 'సిరివెన్నల సీతారామశాస్త్రి' ప్రతీకాత్మకంగా ప్రదర్శించిన భావానికి ప్రతీక 'తొలకరి జల్లు' ఆ ఆనందం, అనుభూతి మొత్తం వేటూరి 'తొలకరి జల్లు'లో పొందుపరచాడు. అదీ ఎలాంటి 'తొలకరి జల్లు' 'చినుకు చినుకులో చిందుల లయ ' ... అద్భుతం. ఎంత రమ్యమైన ఊహ. పాట మొత్తం కవి ఎక్కడా నృత్యం' నుంచి పక్కకు తొలగలేదు. నృత్యంలోని ఆనందాన్ని వర్ణించాడు. నృత్యంలో బ్రహ్మానందాన్ని ప్రదర్శించాడు. నృత్యంలోని ఆధ్యాత్మకతను వివరించాడు. చివరి చరణంలో ప్రకృతికీ నృత్యానికీ ఉన్న అనుబంధాన్ని, దానిలోని ఆధ్యాత్మకతను, దైవ స్వరూపాన్ని స్పష్టం చేశాడు.

**నమక చమక సహజం జం**

**నట ప్రకృతీ పాదజం జం**

నటరాజ విగ్రహంలో ప్రతీకల రూపంలో ఒదిగి ఉన్న ఆధ్యాత్మక అర్థాలను తెలుసుకుంటే వేటూరి ప్రదర్శించిన ప్రతీకల పరమార్థం బోధపడుతుంది. ఒక కవి సినిమా పాట రాశాడంటే 'ఏదో రాశాడ'ని అనుకునే వాళ్లే ఎక్కువగా ఉన్నా నిజాయితీగా, తన కవిత్వ పటుత్వ సంపదను సరస్వతీ పాదాలనలంకరించే పుష్పంలా మలచి సమర్పించిన వేటూరి పాటలను విశ్లేషించటం అంటే భగవంతుడి 'పద రాజీవముల చేరు నిర్వాణ సోపానాల 'అధిరోహణం చేసే త్రోవ వెంట ప్రయాణించటమే.

**ఫూల్ బన్‌గయె ఘుంఘురూ**

**ఘుంఘురూ బన్‌గయె ఫూల్**

**టూట్‌కె పావ్ మె సబ్ కలియా**

**బిచ్ గయి బన్ కర్ ధూల్**

**తాధయ్య తాధయ్య, దేఖో, దేఖో ఝూం కె నాచ్ ఉఠీ హై**

**మేరే అంగ్ సంగ్ మస్ బహార్!**

పూవులు మువ్వలయ్యాయి. మువ్వలు పూవులయ్యాయి. నర్తించే పాదాలనుంచి జారిపడి ధూళిలా గాలిలోకి ఎగసాయి. ఆమె నృత్యం చేస్తూంటే ఆమె లయకనుగుణంగా ఆమె శరీరమంతా వసంతం చిగురించింది. ఆనంద్‌బక్షీ ఉత్తమ స్థాయిలో కవిత్వం గుప్పిస్తూ గేయం రచించినా తెలుగుపాటతో పోలిస్తే సూర్యుడి ముందు నక్షత్రంలా వెలతెలబోతుంది. సూర్యుడు లేనప్పుడు మెరిసే నక్షత్రంలా తెలుగు తెలియని వారిని మురిపిస్తుంది. కానీ తెలుగు పాట విన్న తరువాత హిందీ పాటను మెచ్చటం కష్టం. లక్ష్మీ ప్యారే సంగీతం, రఫీ, లతల స్వరాలు, ఆనంద్‌బక్షీ సాహిత్యం ఉత్తమ స్థాయిలో ఉండి మెప్పించినా కేవలం వేటూరి సాహిత్యం అన్నిటినీ మరపిస్తుంది. తెలుగు పాట స్థాయిని అంబరాన్ని చుంబించే ఎత్తుకు ఎదిగిస్తుంది.

(మరిన్ని పాటలు వచ్చే నెలలో)

Post your comments